
కథ

# ఆత్మబంధువు

గన్నవరపు నరసింహమూర్తి

కారు దూసుకుపోతోంది. వెనుకసీట్లో కూర్చున్న విద్యాసాగర్‌కి చాలా ఆనందంగా ఉంది. అతను ఎన్నో రోజులనుంచి ఎదురు చూస్తున్న రోజు. అతను అమెరికా నుంచీ వచ్చీ ఆర్నెల్లకి పైగా అయింది. ఈ ఆర్నెల్లలో రాఘవని కలవాలనీ ఎంతో ప్రయత్నించాడు. అతని కోసం వెతకని చోటు లేదు. చెయ్యని ప్రయత్నం లేదు. అటువంటిది ఈ రోజు అతని ఎడ్రస్ దొరికింది. అతను ఆలోచిస్తున్నాడు.

రాఘవ.. అవును; తన ప్రాణ స్నేహితుడు, తన జీవితంలో అతిముఖ్యమైన వ్యక్తి. అతనే లేకపోతే తన జీవితం ఏమైయుండేదో ఊహించడం కష్టం. అంతగా ప్రభావితం చేసినవ్యక్తి. అతనే చొరవ తీసుకోకపోతే తను ప్రేమించిన వైదేహి తనకు కాకుండా పోయేది. అతను సహాయం చెయ్యడం వల్లే తాను ఈ రోజు యిన్ని పరిశ్రమలకధిపతి అయ్యేడు. అందుకే రాఘవని త్వరగా కలవాలనీ అతను ఆరాట పడుతున్నాడు. అతనికి గతం కళ్లముందు కదలాడింది.




Story

విద్యాసాగర్, రాఘవలది విజయనగరం దగ్గర ఒక పల్లె... చిన్నప్పట్నించి ఆ ఊరి ఎలిమెంటరీ స్కూల్లో కలిసే చదివారు. ఆ తరువాత ప్రక్క ఊళ్లో హైస్కూల్లో జాయిన్ అయ్యారు. రాఘవతండ్రి ఆ ఊర్లో మోతుబరి రైతు. రాఘవ ఒక్కడే కొడుకు. దీనికి భిన్నంగా విద్యాసాగర్ తండ్రి ఒక సన్నకారు రైతు. అందుకే పదవ తరగతి పాసైన తరువాత విద్యాసాగర్‌ని కాలేజీలో చదివించలేనన్నాడు. అప్పుడు రాఘవ తన తండ్రితో చెప్పి కాలేజీలో జాయిన్ చేయించాడు. ఇద్దరూ ఇంటర్‌లో రూమ్ మేట్స్. ఆరూమ్ అద్దె దగ్గర్నుంచీ భోజనాల ఖర్చుదాకా అన్నీ రాఘవే భరించేవాడు. తన తండ్రికి తెలిసి కొంత, తెలియక కొంత రాఘవ్ విద్యాసాగర్‌కి సహాయం చేస్తుండేవాడు. ఇంటర్ తరువాత డిగ్రీలో కూడా అంతే.

ప్రిన్సిపల్‌ని కలిసి సాగర్ పరిస్థితి వివరించి అతనికి స్కాలర్‌షిప్ వచ్చే ఏర్పాటు చేశాడు. డిగ్రీ రెండో సంవత్సరంలో ఉండగా కాలేజీ ఎలక్షన్స్‌లో రెండు గ్రూపుల మధ్య జరిగిన కొట్లాటలో సాగర్ మీద అక్రమంగా కేసు బనాయించి అరెస్ట్ చేయించారు అవతలి వర్గం వారు. సాగర్‌ని సెల్‌లో కలిసాడు రాఘవ. రాఘవని చూసి సాగర్ ఒకటే ఏడుపు.

''రాఘవా! ఈ లాకప్‌లో ఒకరోజు దాటి ఉంటే ఇంక నా చదువు నాశనం అవుతుంది. నువ్వే ఈ గండం నుంచి కాపాడాలి'' రోదిస్తూ అర్థించాడు సాగర్. రాఘవ మౌనంగా వచ్చేశాడు. అతను ఆస్టేషన్ ఎస్సైని కలిసి పరిస్థితిని వివరించాడు. వెంటనే పదివేల రూపాయలు కడితే జామీన్ మీద వదలిపెడతానన్నాడతను. వెంటనే పదివేల రూపాయలు కట్టాలంటే ఏం చెయ్యాలో రాఘవకి తోచలేదు. రూమ్‌కెళ్లి సైకిల్‌మీద ఇంటికెళ్లాడు. తండ్రికి తెలియకుండా తల్లితో ఈ విషయం చెప్పి ఆమె గొలుసు తెచ్చి తాకట్టుపెట్టి ఆ డబ్బుతో సాగర్‌ని విడిపించి అతని జీవితాన్నీ కాపాడాడు. తరువాత ఆ విషయం ఇంట్లో తండ్రికి తెలిసి అతని చేత ఎన్నో చీవాట్లు తిన్నాడు రాఘవ. అయినా సాగర్‌ని కాపాడానన్న తృప్తి మిగిలింది రాఘవకి.

ఆఖరి సంవత్సరంలో సాగర్ వైదేహితో ప్రేమలో పడ్డాడు. ఆమె అతని క్లాస్‌మేట్. మొదట్లో ఇద్దరూ స్నేహితులుగానే ఉన్నా చదువు పూర్తయేసరికి పీకల్లోతు ప్రేమలో కూరుకుపోయారు. కానీ వచ్చిన చిక్కేమిటంటే వైదేహి ఆ నియోజవర్గపు ఎమ్మెల్యే కూతురు. ఎమ్మెల్యే రఘునందనరావ్ ఎన్నో పరిశ్రమలకు అధిపతి, కోటీశ్వరుడు. ఆ విషయం తెలిసిన రాఘవ ఆమెతో పరిచయం పెంచుకోవద్దని సాగర్‌నివారించాడు. కానీ తాను



ఆమెని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాననీ, తన ప్రేమని సందేహించవద్దని చెప్పడంతో వాళ్లిద్దర్నీ రూమ్‌కి పిలిచి మాట్లాడాడు రాఘవ.

ఆ తరువాత రఘునందనరావ్‌తో చాలా గొడవలు జరిగాయ్. సాగర్‌తో పాటు రాఘవ మీద కూడా కేసు పెట్టించి ఇద్దర్నీ అరెస్ట్ చేయించాడు అతను. కానీ రాఘవ బెయిల్‌మీద విడుదలై రఘునందనరావ్‌ని కలిసి సాగర్, వైదేహిల ప్రేమగురించి విపులంగా చెప్పాడు. పెద్దమనసుతో వాళ్లకి వివాహం చెయ్యమనీ అర్థించాడు. వైదేహి కూడా తాను సాగర్‌నే పెళ్లాడుతానని చెప్పడంతో అతనికి వాళ్ల వివాహానికి అంగీకరించక తప్పలేదు.

వివాహం అయిన తరువాత రఘునందనరావ్ అల్లుడు సాగర్‌కు తను కొత్తగా అమెరికాలో నెలకొల్పిన కంపెనీ బాధ్యతలు అప్ప చెప్పాడు దీంతో సాగర్ వైదేహితో కలిసి పెళ్లైన పదిరోజుల్లోనే అమెరికా వెళ్లిపోయాడు.

అలా వెళ్లిన సాగర్ మళ్లీ ఇరవైఐదు సంవత్సరాల తరువాత తన మామగారు చనిపోవడంతో ఇండియాకి తిరిగివచ్చాడు. మధ్యలో మూడు సార్లు ఇండియా వచ్చినా బిజీ షెడ్యూల్స్ వల్ల రాఘవ గురించీ ఆలోచించే అవకాశం లేకపోయింది. పది సంవత్సరాల క్రితం చివరిసారిగా తన తల్లి చనిపోయినప్పుడు తన పల్లెకొచ్చాడు సాగర్. అప్పుడు తెలిసింది రాఘవ తల్లితండ్రులు అంతకు రెండు సంవత్సరాల క్రితమే చనిపోయారని, రాఘవ ఇంటినీ, పొలాన్ని అమ్మేసి విశాఖపట్నం వెళ్లిపోయాడని చెప్పారు.

కానీ ఇన్నాళ్లకు అతని అడ్రస్ దొరకడంతో సాగర్ ఆనందానికి హద్దులు లేవు. అందుకే అతన్ని కలవాలనీ వెంటనే బయలుదేరాడు.

***

అరగంట తర్వాత కారు ఓ ఇంటిముందు ఆగింది. కారుని చూసి ఓ యువకుడు ఇంట్లోంచి బయటకొచ్చాడు. డ్రైవర్ కారుదిగి ఆ యువకుణ్ణి ''ఇది రాఘవ గారిల్లేనా సారూ'' అని అడిగాడు.

''అవును; మా నాన్న గారే రాఘవగారు'' అన్నాడు. ఈ లోగా సాగర్ వెనుక డోర్ తెరిచి దిగాడు; ఆ యువకుణ్ణి చూసి సాగర్ ఆశ్చర్యానికి లోనయ్యాడు. అతను అచ్చం రాఘవలాగే ఉన్నాడు; ఆ యువకుడు కారు దిగిన సాగర్‌కి నమస్కారం చేశాడు.

''బాబూ! నేను మీ నాన్నగారు రాఘవ స్నేహితులం. నా పేరు సాగర్. విద్యాసాగర్; వాణ్ణి కలవాలని వచ్చాను'' అన్నాడు సాగర్.

''లోపలికిరండి అంకుల్, నాన్నగారు ఆఫీసు కెళ్లారు. ఇంకో గంటలో వస్తారు'', అంటూ లోనికి తీసికెళ్లాడు ఆ యువకుడు. కాసేపటికి అతను వాళ్లమ్మతో తిరిగివచ్చాడు. ఆమె వస్తూనే సాగర్‌కి నమస్కరించింది. ''మా అమ్మగారు'' అంటూ ఆమెని పరిచయం చేశాడా యువకుడు. ఆమె భానుమతి.

''నమస్కారం అమ్మా! నాపేరు సాగర్; నాదీ రాఘవదీ ఒకే ఊరు. కాలేజీలో కూడా కలిసే చదువుకున్నాం; నేను కొన్ని కారణాలవల్ల చదువు అయిపోగానే అమెరికా వెళ్లిపోయి ఈ మధ్యనే వచ్చాను. అందుకే మీరెవరూ తెలియదు నాకు. నేను వచ్చిన దగ్గర్నుంచి వీణ్ణి కలవాలనీ ఎంతో ప్రయత్నం చేశాను. చివరికి నిన్ననే మీ అడ్రస్ దొరికింది. ఎలాగైతేనేం మీ ఇల్లు చివరకు కనుక్కున్నాను. ఇందుకు నాకు చాలా సంతోషంగా ఉందమ్మా'' అన్నాడు సాగర్.

ఎదురుగా గోడమీద రాఘవ భార్యతో ఉన్న ఫోటోని చూసి దగ్గరగా వెళ్లి చూశాడు. ఇరవై ఐదేళ్ల క్రితం చూసిన రాఘవని మళ్లీ యిదే చూడటం.. అదీ ఫోటోని.

ఆ తరువాత వాళ్ల విషయాలన్నీ అడగటం మొదలు పెట్టాడు. ఆమె చెప్పసాగింది. రాఘవ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్నాడనీ, కొడుకు రామకృష్ణ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాడనీ, ఇద్దరు కూతుళ్లు చదువుకుంటున్నారని చెప్పింది. ఇంతలో ఆమె కాఫీ తెచ్చిచ్చింది.

కాఫీ తాగుతూ మళ్లీ అడిగాడు ''ఏమ్మా! నాకు తెలిసిన రాఘవ పరోపకారి. స్నేహం ఇంటే ప్రాణం ఇస్తాడు. ఒకళ్లకి సాయం చెయ్యడమే తప్పా తను ఎవరి సహాయం తీసుకోడు. తను ఎన్ని బాధలు పడ్డా ఎవరినీ కష్టపెట్టడు; ఇప్పటికీ అలాగే ఉన్నాడా కొంచెమైనా మారేడా''?

''లేదన్నగారూ! అతను ఏమీ మారలేదు; ఇప్పటికీ అంతే. అంత నిక్కచ్చితంగా ఉండబట్టే ఇప్పటికి పదిహేను సంవత్సరాల సర్వీసులో పదిసార్లు ట్రాన్స్‌ఫర్లయ్యాయి. ఇది పదకొండో ఊరు. ఎవరికీ తలవంచని మనస్తత్వం ఆయనది''

''మరి రాఘవ చెల్లెళ్లు ఎక్కడున్నారు?''

''వాళ్ళనాన్న గారు చనిపోయిన తరువాత ఆ పొలాల్ని అమ్మేసి వాళ్లిద్దరికీ పెళ్లిళ్లు చేసేశాం. వాళ్లిద్దరూ విశాఖపట్నంలో ఉంటున్నారు. ఈ పట్నంలో ఆయన కొచ్చేజీతంతో సంసారాన్ని నెట్టుకురావడం కొంచెం కష్టంగానే ఉంది. మా వాడికి మొన్ననే ఏదో కంపెనీ నుంచి ఇంజనీరు ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది; వాడికి ఉద్యోగం వస్తే మా ఇబ్బందులు కొన్నైనా తీరతాయి''. వివరాలన్నీ చెప్పింది భానుమతి.

నువ్వు రాఘవ కొడుకువనీ తెలిసే నీకు
ఉద్యోగం ఇచ్చాననీ మీ నాన్నకి చెప్పొద్దు. వాడికీ
విషయం ఎట్టి పరిస్థితుల్లో తెలియరాదు.
వాడు చాలా ఆత్మాభిమానం ఉన్న మనిషి.

వాళ్లు మాట్లాడుతుండగానే రాఘవ వచ్చాడు. రాఘవని చూస్తూనే సాగర్ ఒక్క ఉదుటన లేచి కావలించుకున్నాడు. రాఘవకూడా సాగర్ని తన ఇంటి దగ్గర అలా చూసాక ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఇరవై అయిదేళ్ల తరువాత సాగర్ని చూడటం.. అతనికి ఏం జరుగుతోందో అర్థం కావట్లేదు. మూగవాడే అయ్యాడు. ఇద్దరూ కొంచెం సేపు మాటలు రాని మూగవారే అయ్యారు. కొద్ది సేపటి రాఘవే తేరుకొని అన్నాడు.

''చాలా సంతోషంరా సాగర్; మాయిల్లు ఎంతో కష్టపడీ వెదికి వచ్చినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది''.

ఇక ఇద్దరూ పరిసరాలు మరచిపోయారు. ఒకటే కబుర్లు. చిన్నప్పటి కబుర్లనుంచి అమెరికా దాకా ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. రాఘవ మధ్యలో వైదేహి గురించి అడిగాడు.

''ఒరేయ్ రాఘవా! వైదేహి నిన్ను తలవని రోజు ఉండదురా; తనతల్లిదండ్రుల్నైనా మరచిపోతుంది కానీ నిన్ను మరచిపోదు; ఈ అన్న అంటే ఆమెకి అంత అభిమానం. మాయిద్దరి పెళ్లి దగ్గరుండీ మరీ జరిపించావు కదా అందుకే ఈ అన్న మీద ఆమెకి అంత ఆప్యాయత''. తని మాటలు విన్న రాఘవకి కళ్లు చెమర్చాయి. వాళ్ల స్నేహం చూసి భానుమతి సంభ్రమాశ్చర్యాలకు లోనైంది.

కొంతసేపటి తరువాత సాగర్ లేస్తూ ''రాఘవా! మరి నేవెళ్లొస్తాను; ఇక మీ ఇల్లు తెలిసిందికదా తరచు వస్తుంటాను; రేపు మీ కుటుంబం అంతా మా ఇంటికి రావాలి. అందుకే ఇప్పుడు మీ అబ్బాయి రామకృష్ణ నాతో మా ఇంటికి తీసికెళతాను. వాడు మా ఇల్లు చూసినట్లుంటుంది; రేపు మీరు తేలిగ్గా మా ఇంటికొచ్చేయవచ్చు'' అంటూ రామకృష్ణని తీసుకొని బయలు దేరాడు సాగర్. రాఘవ, భానుమతి పిల్లలు కారు దాకా వచ్చి వాళ్లకు వీడ్కోలు పలికారు.

***

కారు రాఘవ ఇల్లుదాటగానే రామకృష్ణతో అన్నాడు విద్యాసాగర్.

''రామకృష్ణా! చూశావా మా ఇద్దరి స్నేహం. పాతికేళ్ల తరువాత మీ నాన్నని చూసినందుకు నాకు చాలా సంతోషం కలిగింది. ఇంతకీ అసలు విషయం చెబుతాను విను; ఇంతకీ మీ ఇంటి అడ్రస్ ఎలా కనుక్కున్నానో తెలుసా; నువ్వు ఇంజనీరు ఉద్యోగానికి అప్లై చేసింది మా కంపెనీకే. దానికి నేను ఛైర్మన్‌ని. సాధారణంగా ఇంటర్వ్యూకి రాబోయే అభ్యర్థుల లిస్ట్ ఫైనల్‌గా నాకు పంపిస్తారు. అందులో నీ వివరాలు చూస్తుంటే మీ నాన్న పేరు ఇంటి పేరుతో సహా చూసి మీనాన్నే నా స్నేహితుడు రాఘవనీ పోల్చుకున్నాను. అలా మీ ఇంటి కొచ్చాను'' అతను చెబుతుంటే రామకృష్ణ ఆశ్చర్యంగా వింటున్నాడు.

''నువ్వు ఎల్లుండి ఇంటర్వ్యూకి హాజరవ్వు. ఆ రోజే నీకు ఆర్డర్స్ ఇచ్చేస్తాను. వెంటనే జాయిన్ అవుదువు గాని. నీకో పెద్ద బంగళా కూడా కంపెనీ ఇస్తుంది. మీరందరూ అందులోకి షిఫ్ట్ అవుదురుగానీ. కానీ ఒక్క విషయం నువ్వు రాఘవ కొడుకువనీ తెలిసే నీకు ఉద్యోగం ఇచ్చాననీ మీ నాన్నకి చెప్పొద్దు. వాడికీ విషయం ఎట్టి పరిస్థితుల్లో తెలియరాదు. వాడు చాలా ఆత్మాభిమానం ఉన్న మనిషి. తెలిస్తే ఒప్పుకోడు. వాడు ఎవర్నించీ అందులోనూ నా లాంటి స్నేహితుల్నించి ఏ సహాయం తీసుకోడు'' అతను చెబుతుంటే రామకృష్ణకి తన తండ్రి ఎంతటి గొప్ప వ్యక్తిత్వం ఉన్నవాడో అర్థమైంది.

''నేనీరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం మీనాన్నే. వాడి ఋణాన్ని జన్మజన్మలకీ తీర్చుకోలేను. ఆనాడు వాడు నాకు సాయం చేశాడనీ నేనీనాడు నీకు ఉద్యోగం ఇస్తున్నానని నీవనుకోవద్దు. వాడుచేసిన సహాయానికి వెలకడితే నాకంటే పాపాత్ముడెవరూ ఉండరు; మా రాఘవ కొడుక్కి ఉద్యోగం ఇవ్వడం అన్నది నా బాధ్యత. నా జీవితంలో అత్యంత ఆనందకరమైన విషయం; వాడు మా ఆత్మబంధువు'' చెమర్చిన కళ్లను తుడుచుకుంటూ అన్నాడు విద్యాసాగర్.

కారు విద్యాసాగర్ ఇంటివైపు దూసుకు పోతోంది.

*